1993
నుండి
వెలువడుతున్నది

నెగ్గిక : కుదిరాపి
(విజయ : ఆశ్వయుజము)

అక్టోబరు 2013

తెలుగుజాతి పత్రిక

# నడుస్తున్న చరిత్ర

•నుడి •నాడు •నెనరు

15 రూ.



"పుట్టుక దగ్గర చావు దగ్గర
పరభాషలో నవ్వలేను ఏడ్వలేను"

"సృజనకు విత్తు స్వంతభాష
రచనకు సత్తువ ప్రజలభాష"

"ఘర్షణవద్ద పీడనవద్ద
నిర్బంధంవద్ద త్యాగం వద్ద
పోరాటం వద్ద రక్తపాతం వద్ద
యుద్ధం వద్ద శాంతివద్ద
పుట్టిన శబ్దసంచయ సౌందర్యం
మాతృభాష–
మెతుకులోని శక్తినుండి పుట్టి
చెరుకులోని రసం నుండి పుట్టి
మా పెదవుల సవ్వడి కర్మ నుండి
క్రియలోకి దుమికిన భాష కావాలి"

"అమ్మా! నీ భాష కావాలి
నిప్పులు చెరగటానికి
చెమటను జల్లెడపట్టి సంపదలను
తీయటానికి
తెలుగు పౌరుషాగ్నిని రాజెయ్యడానికి
మాతృభాష కావాలి".

'మాతృభాష'ను హేతుబద్ధంగా మానవీయంగా
నిర్వచించిన కవి

## ఛాయరాజ్

6.7.1948 - 20.9.2013

## చదువరులతో ఒకమాట....



**ఎస్.పి.వై.రెడ్డి, బి.ఇ.,**
**భారత పార్లమెంటు సభ్యులు**
**నంది సంస్థల అధినేత, నంద్యాల.**
**నడుస్తున్న చరిత్ర పోషకులు**

ఈ నాలుగు మాటలు వ్రాయబోయే సమయానికి - 12వ తేదీ సా.4గం.లకు పెను తుపాను ఉత్తరాంధ్రనూ, ఒడిశానూ అల్లకల్లోలం చేయడానికి ముంచుకొచ్చేస్తుంది. ఫైలిన్ అనే ఈ తుఫాను తీవ్రత గంటకు 230 కి.మీ. వేగంతో వస్తోంది. ఇన్ని అడుగుల ఎత్తున ఉప్పెన ముంచబోతున్నదో భయాన్ని కలిగిస్తోంది. లక్షలాది మందిని రక్షించటానికి ఒడిశా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు పునరావాస శిబిరాలను ఏర్పాటు చేస్తున్నవి. ప్రాణ నష్టాన్ని తగ్గించటమే లక్ష్యంగా అధికార యంత్రాంగం తీవ్రంగా యత్నిస్తున్నది. ఈ తరుణంలోనూ, నష్టాల తీవ్రత తేలిన తరువాతా మన తోటి ప్రజల్ని ఆదుకోవడానికి ప్రభుత్వంతోపాటు ప్రజలు కూడా శక్తివంచన లేకుండా తోడ్పడవలసి వుంది. దసరా పండుగరోజుల్లో ఈ పెనుముప్పు రావటాన్ని తలచుకొంటేనే మనసు వికలం అవుతున్నది. అందరూ సంతోషంగా ఉంటేనే కదా, ఏ పండుగైనా. ఎంత తక్కువ నష్టంతో ఈ ముప్పు నుంచి బయటపడగలమో కొద్ది రోజులు గడిస్తేనేగాని తెలీదు. తుపాను ముప్పుకు లోనైన ప్రజలందరికీ మనమంతా అండగా నిలవాలి.

**ఈ పత్రికలో రచయితలు వ్యక్తం చేసే అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.**

సెప్టెంబర్ 20న తనువును వీడిన కవి ఛాయరాజ్ తెలుగు భాషను, తెలుగు ప్రజల్ని గాఢంగా ప్రేమించి, పీడితుల పక్షాన నిలిచిన గొప్ప మనిషి. సుఖాలకోసం తాపత్రయపడక కవిగానేగాక ప్రజాఉద్యమాలలో భాగస్వామిగా జీవితమంతా పనిచేసిన ప్రజలమనిషి.
పుటలు 10, 11, 12,13.




## లోపలి పుటలలో....


| | | |
|---|---|---|
| **సంపాదక హృదయం :** మన సమస్యల్ని మనమే పరిష్కరించుకోవాలి | | 7 |
| **భాష - రాజ్యం - రాజకీయాలు :** జెండాలు వేరైనా...... | | 9 |
| కవి ఛాయరాజ్ కవిత్వసారం | 'ప్రజాసాహితి' నాగరాజు | 11 |
| **తెలుగుజాతి ఘనకీర్తి చరిత్ర :** శాతవాహనుల తొలి రాజధాని | | 14 |
| **గిడుగు 150వ జయత్యుత్సవాలు :** | వేదగిరి రాంబాబు | 17 |
| **ముఖాముఖి :** సవర భాషకు గిడుగు సేవను కొనసాగించిన అల్లంసెట్టి చంద్రశేఖరరావుతో | | 21 |
| **వారసత్వ సంపద :** | ఈమని శివనాగిరెడ్డి | 24 |
| **ఆంధ్ర ధాతుపాఠం / ఆంధ్ర ధాతుమాల** | వేదం పట్టాభిరామశాస్త్రి | 25 |
| **తమిళ కథ :** నొప్పి | కవిపిత్తన్ | 29 |
| ఎస్.వి. రామారావు చిత్రకళా ప్రదర్శన ప్రారంభ ప్రసంగం | అబ్దుల్ కలాం | 32 |
| చెన్నపట్నం భవిష్యత్తు గురించి ... | కట్టా నరసింహులు | 33 |
| **ముఖాముఖి :** 'జలంబడి' నిర్మాత అంగత వరప్రసాదరావుతో | | 35 |
| **వక్కాణం :** విధానాలపై ప్రస్తావనలు లేవే.... | చలసాని నరేంద్ర | 38 |
| **మూడు గొప్ప పుస్తకాల పరిచయం....** | | 44 |
| **పుస్తక సమీక్ష :** బ్రౌను ఉదాహరణం | జి. పూర్ణకళ | 48 |
| **నోలిలు (గ్రంథాలయం)** | | 49 |
| **సాహితీరంగ వార్తలు** | | 50 |

కవితలు: **ఛాయరాజ్ (12) డా॥ దామెర రాములు(16) గజానన్ తామన్(23)**
**సప్రం గణేష్‌బాబు (40) మాధవరావు యద్దనపూడి, ముదిగొండ శివప్రసాద్ (42)**
**మాచవోలు శ్రీధరరావు (43) కత్తి పద్మారావు (47)**

కైసేత : **షాకిరా, లావేటి త్రివేణి** పకపకలు : సరసి



సంపాదకుడు : **డా॥ సామల రమేష్‌బాబు**

**నడుస్తున్న చరిత్ర**, జి-2, శ్రీవాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520004.
e-mail : ncharithra@gmail.com
దూరవాణి: (కార్యాలయం) 0866 - 2439466 సంపాదకుడు : 98480 16136


రచయితలకు విజ్ఞప్తి : మీ రచనలతోపాటు, హామీ పత్రాన్ని తప్పక జతపరచాలి. ఆ రచన ఏ ఇతర పత్రిక పరిశీలనలోనూ లేదనీ కేవలం నడుస్తున్నచరిత్రలో ప్రచురణకు మాత్రమే పంపుతున్నామని హామీ పత్రంలో వ్రాయాలి. మీ పేరు, పూర్తి చిరునామా, ఫోను నెంబరు తెలియపరచాలి.

సంపాదకీయం

# మన సమస్యల్ని మనమే పరిష్కరించుకోవాలి

అన్యాయం జరుగుతున్నపుడు దాన్ని ఎదిరించక తప్పదు. ఒక వ్యక్తికో, ఒక వర్గానికో జరిగే అన్యాయాన్ని ఎదిరించడంలో తోటివ్యక్తుల, వర్గాల తోడ్పాటు ఉంటుంది. పరిష్కారమూ అందుబాటులో ఉంటుంది. కాని, ఒకేరాష్ట్రంలోని రెండు ప్రాంతాల మధ్య తమకు జరిగిన అన్యాయాలకు భౌగోళిక గిరులు గీచుకొని మరీ కయ్యానికి దిగితే - మంచిచెడుల విచక్షణ లేకుండా రెచ్చగొట్టే వాదాలకు దిగితే దాన్ని ఎవరు పరిష్కరించాలి? బయటి రాష్ట్రాలవాళ్లో, ప్రభుత్వంలో ప్రతిపక్షంలో ఉన్న పాలకవర్గాలో పరిష్కరించాలా? అటువంటప్పుడు ఇరుపక్షాలకూ పూర్తిగా న్యాయం జరుగుతుందా? పిట్టపోరు, పిట్టపోరూ పిల్లి తీర్చిందన్నట్లు కాదా? గుంటనక్కల మాదిరిగా ఆ పరిష్కర్తలు ప్రవర్తించరా? మొత్తంమీద భాషారాష్ట్రంలోని ప్రజల భావానుబంధాలు దెబ్బతినవా? తెలుగువాళ్లకు ప్రజలందరి అభిమానాన్ని పొందగల సామాజిక, రాజకీయ నాయకత్వం లేనందువల్లే ఇప్పటి ఈ స్థితి నెలకొన్నదన్నది వాస్తవం కాదా? బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్న మన రాజకీయపక్షాలకు ఎలా బుద్ధి చెప్పగలం?

ఒక భాషారాష్ట్రంగా ఏర్పడి 60 ఏళ్లయినా అందుకు ప్రాతిపదిక అయిన తెలుగును మనం ఎంతవరకు కాపాడుకోగలిగాం? ఎంతవరకు పెంపొందించుకోగలిగాం? ప్రజలభాషలో పరిపాలించుకోవాలనే ప్రాథమిక సూత్రమే కదా భాషారాష్ట్రాల ఏర్పాటుకు కీలకం. ఒక భాషాజాతిగా ఎదగడానికి కావలసిన అన్ని అవకాశాలను కలిగించుకోవడమే భాషారాష్ట్రాల ప్రయోజనం. భారతదేశ అంతర్భాగంగా ఉంటూనే ఈ భాషాజాతులు ఎదగాలనే సమున్నత ప్రయోజనం భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో అంతర్లీనంగా ఉంది. ఒక ప్రజాతంత్రరాజ్యాన్ని ఏర్పరచుకొనేటపుడు ఇది తప్పనిసరి. భారతదేశ భౌగోళికత, చరిత్ర, సామాజికత తదితర కారణాల వల్ల ఎన్నో భాషాజాతులు ఇక్కడ ఉన్నాయి. అవన్నీ భారత జాతీయతలో ఇమిడి ఉన్నా, వాటి ప్రత్యేకతలు వాటికున్నాయి. అలాంటి ప్రాచీనమైన పెద్దజాతి తెలుగుజాతి. దీనిలో వైవిధ్యం ఉంది. అనేక ప్రాంతాలకు విస్తరించిన ఎంతో చరిత్ర, సాంస్కృతిక సంపద ఆ వైవిధ్యంలో భాగంగా ఉంది. అందుకే తెలంగాణ, ఉత్తరాంధ్ర, ఉత్తరకోస్తా, దక్షిణకోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో యాసల్లో, పలుకుబడుల్లో, కళల్లో, వంటావార్పుల్లో, సంప్రదాయాల్లో ఎంతో వైవిధ్యం ఉంది. ఇవన్నీ తెలిసి కూడా మన పెద్దలు అన్ని ప్రాంతాలవారి మధ్య ఉన్న తెలుగు అనుబంధానికి ప్రాముఖ్యతనిచ్చి - ఒక పెద్ద భాషాజాతిగా దీన్ని చూడాలనుకున్నారు. ఆ ఆవేశం, ఆకాంక్షల మాటున అధికారవాంఛతో పొంచి వున్న రాజకీయపార్టీల, నాయకుల లక్ష్యాలు వేరు. వారికి తెలుగు భాషారాష్ట్రం అనేది తాము అధికార సోపానాన్ని అందుకోవడానికి ఒక పట్టుగొమ్మ. రాష్ట్రం ఏర్పడిన తర్వాత - ఇంతవరకు ఏర్పడిన ప్రభుత్వాలేవీ ఒక సైద్ధాంతిక అంశంగా, జాతికి ప్రాణావసరంగా 'మా భాషావిధానం ఇది' అని ఎన్నడూ ప్రకటించలేదు. కేంద్రపు త్రిభాషాసూత్రం ముసుగున, మైనారిటీ మెజారిటీ వాదాల చాటున భాషారాష్ట్ర ప్రాతిపదికను అడుగునుంచి కుళ్ళబొడుస్తూనే ఉన్నారు. చివరకు హిందీని, ఇంగ్లీషును ఆశ్రయించని బ్రతుకు తెలుగువారికి వీలుపడదనే అప్రకటిత సిద్ధాంతాన్ని ఆచరణలోకి తెచ్చారు. అందువల్లే ఇప్పుడు జాతీయంగా హిందీ వారి పెత్తనానికి, అంతర్జాతీయంగా అన్నిరంగాల్లో ఇంగ్లీషు పెత్తనానికి లోబడి మన బ్రతుకుల్ని ఈడుస్తున్నాము.

ఇప్పటికైనా సమైక్యరాష్ట్రంగా ఉండాలనేవారు గాని, ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పడాలనేవారు గాని భాష పట్ల తమ విధానం ఎలా ఉండబోతుందో చెప్పరు. ఆ ప్రస్తావననే తలపెట్టరు. ఈ 60 ఏళ్లలో అందుకోసం ఏం చేశారో చెప్పరు. తెలంగాణ ఉద్యమకారుల్లో భాషాసంస్కృతుల గురించి మాట్లాడేవారు కూడా ఈ అంశంపై స్పష్టంగా మాట్లాడరు. తెలంగాణ ఏర్పడగానే తరతమ భేదం లేకుండా అందరికీ ప్రాథమికవిద్యను పూర్తిగా ఆంగ్లంలో అందిస్తామని తెరాస నేత చంద్రశేఖరరావు ప్రకటించారు. అశాస్త్రీయమైన ఈ పనిని దాదాపుగా

సంపాదకీయం

ఏనాడో రాజశేఖరరెడ్డిగారూ, ఆయన సహచరులూ చేసేశారు. ఇప్పుడు ఆయన వారసులైన రాష్ట్రపాలకులు తెలుగు పేర చేసే సభలూ, వాగ్దానాలూ అన్నీ ఉత్తుత్తివే. చిత్తశుద్ధి లేనివే.

ఇక - రాజకీయార్థిక సామాజిక అంశాల్లో వీళ్లకేవైనా పరస్పర భేదాభిప్రాయాలున్నాయా అంటే కచ్చితంగా 'లేవు' అనే చెప్పాలి. అందరూ దోపిడీని, అణచివేతను అనుమతించేవారే, భాగస్వాములే. స్వార్థరహితంగా ప్రజల కోసం పనిచేస్తున్న ప్రతినిధులు ఇప్పుడున్న చట్టసభల్లో ఎందరున్నారో చెప్పమనండి.

కేంద్రంలోని ప్రభుత్వానికీ, అధికార ప్రతిపక్షపార్టీలకు నేతృత్వం వహించేవారు ఇందుకు మినహాయింపు కాదు. వాళ్లకు స్పష్టంగా రాజకీయ అవసరాలున్నాయి. ఇన్నాళ్లూ నాన్చిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమస్యకు ఇప్పుడు పరిష్కారం చూపాలనే తపన రానున్న ఎన్నికల్లో విజయం కోసం మాత్రమే. దీర్ఘకాలిక సమస్యలకు అత్యవసర పరిష్కారాలుండవు. వాటికోసం శ్రద్ధతో పూనుకోవాలి. కాని, పూటకో మాట మార్చే కేంద్రనాయకత్వం ఇప్పుడు తెలుగుజాతితో ఆడుకొంటోంది. డబ్బుకో పదవికో లొంగిపోయి, బానిసల్లా ప్రవర్తించే మన నాయకులంటే వారికి చులకన భావం. 9 కోట్ల ప్రజల భవితవ్యంతో ఆడుకొనే అవకాశాన్ని వారికిచ్చిన తమ ప్రతినిధులను ఈ ప్రజలు శిక్షించే అదను వస్తుంది.

దశాబ్దాలుగా ఉన్న తెలంగాణ సమస్యకు సమైక్యరాష్ట్రవాదం పరిష్కారం కాదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా, అక్కడి ప్రజల రాజకీయ, సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారం అంత తేలిక కాదు. మళ్లీ ఇప్పుడున్న నాయకులే జెండాలు మార్చి, ముసుగులు మార్చి వస్తారు తప్ప అన్నీ పాతవిధానాలే. మార్పు కోసం అన్ని రంగాల్లో కొన్నేండ్లపాటు ప్రజలు ఉద్యమించి పోరాటాలు సాగిస్తేనే వారు కోరుకొనే తెలంగాణను నిజంగా రూపొందించుకోగలుగుతారు. ఇందుకోసం వారు తమ భాషనే ఆయుధంగా చేసుకోవాలి. తెలంగాణ సిసలైన తెలుగురాష్ట్రంగా, ప్రజలరాజ్యంగా తయారుకావాలి. ఇందుకు కావలసిన భూమిక తెలంగాణ ప్రజాపోరాట రీతుల్లో ఉంది.

ఒక్క విషయాన్ని సమైక్యవాదులు గుర్తించాలి. ఆంధ్రప్రదేశ్‌ను విభజించడమంటే తెలుగుజాతిని చీల్చడం, తెలుగుతల్లిని చీల్చడం అని కొందరు నినాదాలిస్తున్నారు. రెండు రాష్ట్రాలేర్పడినా రెండూ తెలుగురాష్ట్రాలే అవుతాయన్న సంగతిని వీరు మరచిపోతున్నారు. ఇలాంటి అతివాదాన్నే భాష విషయంలో తెలంగాణ వాదులూ చేస్తున్నారు. భాషను తల్లిగా భావించేందుకు ప్రతీకగా తెలుగుతల్లి మాట వచ్చింది తప్ప అది ప్రాంతాన్ని సూచించేది కాదు. ఆంధ్రప్రదేశ్‌లోని వారే కాదు, పొరుగురాష్ట్రాల్లోని తెలుగువారు కూడా తెలుగుతల్లి ప్రార్థన చేస్తారు. రెండు ప్రాంతాలవాదులాటల్లో తెలుగుతల్లి భావనను జొప్పించడంతో జరిగిన, జరుగుతున్న నష్టాన్ని దయచేసి గమనించండి. రాజకీయనాయకులు తమ తుచ్ఛస్వార్థానికి ప్రజల భాషా సాంస్కృతిక సహజీవనాన్ని ఎంతగా దెబ్బతీయగలరో తెలియడానికి ఇది చరిత్ర మనకు మిగుల్చుతున్న గుణపాఠం. అటువంటిదే - విగ్రహాల విధ్వంసం కూడా - అది ఎవరు చేసినా ఎందుకు చేసినా. మొత్తంమీద ఇంతవరకు మన ఉద్యమాలు మనకు మిగిల్చింది వందలాది యువకుల, అమాయకుల బలిదానం, వారి తల్లులకు గర్భశోకం. యువతలో భవిష్యత్తు పట్ల భయం. మోసం జరిగిందనే, జరుగబోతోందనే ఆందోళన. ఇదంతా మన నాయకులు ఇంతకాలంగా అనుసరిస్తున్న విధానాల విషఫలితం.

అభివృద్ధీ, ఆదాయం, సుఖాలు, వైభోగాలు అన్నీ కొందరికే అందాలి! బలమో, తెలివో ఉన్నవాడిదే బ్రతుకు! నీతినిజాయితీలకు, శ్రమకు విలువలేదు. మన భాష, మన సంస్కృతి, మన తెలివి, మన శ్రమ- ఇదంతా పనికిరాదు. మనం బానిసల్లాగా బ్రతికేందుకే పుట్టాం! మన స్వాతంత్ర్యం ఒక మిథ్య! - ఇవీ ఇప్పుడు మన యువత ముందుంచిన ఆదర్శాలు! వీటినుంచి మనం బయటపడాలి. మేధావులైనవారు, సమాజసేవాభావం కలిగినవారు కలిసి ఆలోచించి దారి చూపాలి. అన్నిప్రాంతాల నుంచీ ఆలోచనాపరులు కదలాలి. మన సమస్యల్ని మనమే పరిష్కరించుకోవాలి.

**10-10-2013**



## ఏ రాష్ట్రంలో ఉన్నా ఏ దేశంలో ఉన్నా తెలుగువారంతా ఒక్కటే

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2240**

* * *

**Read other issues of Nadustunna Charitra @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Nadustunna+Charitra+Magazine&id=60**